పట్టిసీమ నుంచి 5,310 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం :పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేసినట్లు ఆ పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు పెద్దిరాజు ఆదివారం తెలిపారు. ఈ ఏడాది జూన్ 14వ తేదీ నుంచి ఇప్పటివరకు 8.1632 టిఎంసిల నీటిని కృష్ణా డెల్టాకు విడుదల చేసినట్లు డిఇ తెలిపారు. గోదావరి నీటిమట్టం 24.180 మీటర్లకు పైబడి ఉండని 15 మోటార్లు 15 పంపులతో నీటి విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

స్పిల్‌వే నుంచి 13,06,267 క్యూసెక్కుల జలాలు విడుదల

పోలవరంలో గోదావరి నీటి మట్టం ఆదివారం సాయంత్రానికి అనూహ్యంగా పెరిగింది. పోలవరంలో గోదావరి నీటిమట్టం 24.757 మీటర్లకు చేరుకున్నట్లు సిడబ్ల్యుసి అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న వరద జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న 13,06,267 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు ఇఇ మల్లికార్జునరావు, డిఇ మాధవరావు తెలిపారు.

పెరుగుతూ.. తగ్గుతూ..!

- మళ్లీ తగ్గుముఖం పట్టిన వరద ఉధృతి
- భద్రాచలం వద్ద 48 అడుగులకు చేరిన నీటిమట్టం
- ఇంకా గ్రామాలను వీడని వరద ముంపు
- 5 వేల మందికిపైగా బాధితులు పునరావాస కేంద్రాల్లోనే
- ఆగస్టు నెలాఖరు వరకూ టెన్షన్ తప్పదంటున్న బాధితులు

కుక్కునూరు మండలంలోని వెంకటాపురం ఎస్‌సి కాలనీ మధ్య ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గోదావరి వరద తగ్గుతూ.. పెరుగుతూ దోబూచులాడుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వారంరోజులుగా గోదావరి వరద అందరిలోనూ తీవ్ర ఆందోళన రేపుతోంది. జులై 21వ తేదీన గోదావరికి వరద ఉధృతి పెరగడం ఆరంభమైంది. దీంతో అప్రమత్తమైన అధికారులు విలీన మండలాలైన కుక్కునూరు, వేలేరుపాడులో 35 గ్రామాలను వరద ప్రభావిత గ్రామాలుగా గుర్తించి చర్యలు మొదలు పెట్టారు. దాచారం, మర్రిపాడు, కివ్వాక వంటి పునరావాస కేంద్రాలకు తరలించారు. రుద్రంకోట, కోయిదా వంటి పలు గ్రామాల ప్రజలు కొండలు, ఎత్తైయిన ప్రాంతాలకు వెళ్లి నివాసం ఏర్పరచుకున్నారు. 24వ తేదీ బుధవారానికి భద్రాచలం వద్ద 53 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక సైతం జారీ అయ్యింది. అనంతరం గోదావరి వరద తగ్గుముఖం పడుతూ వచ్చింది. గురువారం సాయంత్రానికి ఒక్కసారిగా భద్రాచలం వద్ద 45 అడుగులకు నీటిమట్టం తగ్గింది. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కరోజు వ్యవధిలోనే మరోసారి గోదావరికి వరద పోటెత్తింది. ఆదివారం ఉదయానికి భద్రాచలం వద్ద నీటిమట్టం 53 అడుగులు దాటేసింది. అంతా తీవ్ర ఆందోళనకు గురవుతున్న పరిస్థితిలో వరద మరోసారి తగ్గుముఖం పట్టింది. ఆదివారం సాయంత్రానికి నీటిమట్టం 48 అడుగులకు చేరింది. భద్రాచలం వద్ద వరద ఉధృతి తగ్గినప్పటికీ గ్రామాలను మాత్రం ఇంకా వరద ముంపు వీడలేదు. కుక్కునూరు ఏ బ్లాక్‌లో ఇంకా ఇళ్లలో చేరిన వరదనీరు తగ్గలేదు. రహదారులపై సైతం వరదనీరు అలాగే ఉంది. సోమవారానికి వరద ఉధృతి మరింత తగ్గే అవకాశం ఉందని చెబుతున్నారు. వరద తగ్గుతుందా.. మళ్లీ పెరుగుతుందా అన్న ఆందోళన అందరిలోనూ నెలకొంది. వరద నీరు చుట్టుముట్టడంతో కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు ఐదు వేల మందిని ఇప్పటి వరకూ పునరావాస కేంద్రాలకు తరలించారు. దాచారం, మర్రిపాడు పునరావాస కాలనీలకు అత్యధిక మందిని తరలించిన పరిస్థితి ఉంది. వరద బాధితులందరికీ బియ్యం, కూరగాయలు, నిత్యావసర వస్తువులను అధికారులు అందించారు.

ఆగస్టు పూర్తయ్యే వరకూ పునరావాస కేంద్రాల్లో ఉండాల్సిందే..

ఏటా జులై, ఆగస్టు నెలల్లో గోదావరి వరదలు ముంచెత్తుతున్నాయి. జులైలో పునరావాస కేంద్రాలకు చేరిన వరద బాధితులు ఆగస్టు నెల ముగిసే వరకూ అక్కడే ఉండాల్సి వస్తోంది. గడిచిన రెండేళ్లుగా నెలకొన్న అనుభవాలు స్పష్టంగా చెబుతున్నాయి. వరద సమయంలో అందిస్తున్న నిత్యావసర వస్తువులు, కూరగాయలు వారం రోజుల్లోనే అయిపోతున్నాయి. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. పొలాల్లోకి వరదనీరు చేరడంతో అక్కడి ప్రజలకు వ్యవసాయ పనులు సైతం ఉండడం లేదు. పనుల్లేక చేతిలో చిల్లిగవ్వలేక పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వరద బాధితులు అర్ధాకలితో ఇబ్బందులు పడుతున్నారు. రోజు గడవడమే కష్టంగా మారుతోంది. వరద బాధితులు ఇంటికి చేరి కుదురుకునే వరకూ వారికి సాయం అందించాల్సి ఉంది. గత ప్రభుత్వం మాదిరిగా కాకుండా నిర్వాసితులను ఆదుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో చూడాల్సి ఉంది.

ఇళ్లల్లోనే వరద నీరు.. ముంపులోనే రహదారులు

ప్రజాశక్తి - కుక్కునూరు

ముంపు మండలాల్లో 12 రోజులుగా పెరుగుతూ, తగ్గుతూ విలీన మండలాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న గోదావరి వరద తగ్గుముఖం పట్టింది. శనివారం సాయంత్రం భద్రాచలంలో 53.8 అడుగులకు చేరి ఆదివారం నిదానంగా తగ్గి 49 అడుగులకు చేరడంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. భద్రాచలంలో గోదావరి వరద తగ్గుముఖం పట్టినా శబరి నది ఉధృతంగా ప్రవహిస్తుండడంతో మండలంలో వరద ఉధతి కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే మండల కేంద్రంలోని మసీద్ సెంటర్, రజక బజారు, రామాలయం కాలనీ, గణేష్ నగర్ కాలనీల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరి ముంచెత్తింది. ఆయా కాలనీలకు చెందిన బాధితులు సామాన్లు సర్దుకుని కివాక పునరావాస కేంద్రానికి తరలుతున్నారు. వరద ఉధృతి తగ్గకపోవడంతో మండలంలోని బెస్తగూడెం ఎస్‌సి కాలనీ, ఎల్లప్పగూడెం, బాపనగూడెం గ్రామాలకు చెందిన వరద బాధితులు రాయికుంట, మర్రిపాడు పునరావాస కాలనీలకు తరలుతూనే ఉన్నారు. చీరవల్లి, వింజరం మధ్య ప్రధాన రహదారిపై వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. బూర్గంపాడు వేలేరు మధ్య, వేలేరు వెంకటాపురం మధ్య ప్రధాన రహదారులపై వరద తగ్గినా చెత్తాచెదారం, ఒండ్రు పేరుకుపోవడంతో భద్రాచలం, కుక్కునూరుకు రాకపోకలు నిలిచే ఉన్నాయి. ఇప్పటికే 12 రోజులుగా కుక్కునూరు, దాచారం, ముత్యాలంపాడు వింజరం, సీతారామనగరం, వేలేరు మధ్య ప్రధాన రహదారులను వరద ముంచెత్తడంతో 25 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలాన్ని వరద నీరు చుట్టుముట్టి ఇళ్లల్లోకి చేరడంతో ఇప్పటికే గొమ్ముగూడెం, లచ్చిగూడెం బెస్తగూడెం వేలేరుపాడు మండలంలోని రేపాక కొమ్ము గ్రామాలకు చెందిన వరద బాధితులు రావికుంట పునరావాస కేంద్రంలో, కుక్కునూరు ఏ బ్లాక్‌లోని వరద బాధితులు కివ్వాక పునరావాస కేంద్రంలో, కౌండిన్య ముక్తిబాపన గూడెం గ్రామాలకు చెందిన వరద బాధితులు మర్రిపాడు పునరావాస కేంద్రంలో తలదాచుకున్నారు. ఎగువ ప్రాంతాల్లో ప్రాజెక్టులు నిండుకుండలా ఉండడం ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వచ్చిన నీటిని వచ్చినట్లే దిగువకు వదులుతుండడంతో గోదావరికి భారీగా వరద చేరి తగ్గడం పెరుగుతుండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ముంపు మండలాల ప్రజలు భయం భయంగా గడపాల్సిన పరిస్థితి నెలకొంది.

చంద్రన్న బీమా.. ఉన్నట్లా లేనట్లా..!

- ప్రభుత్వం మార్పుతో వైఎస్ఆర్ బీమాగా పేరుమార్పు
- ఇప్పటికీ విధి విధానాలు ఖరారు కాని పరిస్థితి
- సహజ మరణానికి రూ.ఐదులక్షలు, ప్రమాదం జరిగితే రూ.పది లక్షలు అంటూ కూటమి మ్యానిఫెస్టో
- జూన్ 30 తర్వాత మరణించిన వారిపేర్లు ఆన్‌లైన్‌లో నమోదు నిల్
- రెండు జిల్లాల వ్యాప్తంగా జులైలో పదుల సంఖ్యలో ఇంటిపెద్దను కోల్పోయిన కుటుంబాలు
- గ్రామ సచివాలయాలకు వెళ్లి నిరాశగా వెనక్కి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రభుత్వం మారడంతో వైఎస్ఆర్ బీమా స్థానంలో చంద్రన్న బీమా అమలు కానున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకూ దానికి సంబంధించిన విధి విధానాలు ఏమీ రూపొందించలేదు. దీంతో జులైలో మరణించిన వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదుకాకపోవడంతో కుటుంబసభ్యులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. దీంతో చంద్రన్న బీమా ఉన్నట్టా.. లేనట్టా అంటూ జనం చర్చించుకుంటున్న పరిస్థితి నెలకొంది. 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకం అమలు చేసింది. ఇంటి పెద్ద మృతి చెందితే రూ.రెండు లక్షలు వరకూ ఇచ్చేవారు. దీంతో నిరుపేద కుటుంబాలకు ఇది ఎంతగానో ఆర్థికంగా ఉపయోగపడేది. 2019లో వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ పథకానికి వైఎస్ఆర్ బీమా అంటూ పేరు మార్చింది. ఆర్థిక సాయం రూ.లక్షకు మాత్రమే పరిమితం చేసింది. దీనిపై అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. మళ్లీ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వైఎస్ఆర్ బీమా పేరును చంద్రన్న బీమాగా మార్పు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన విధి విధానాలు ప్రకటించలేదు. కుటుంబ పెద్ద మృతి చెందితే మాత్రమే ఇస్తారా.. కుటుంబంలో ఎవరు చనిపోయినా బీమా సాయం అందిస్తారా అనేది తేలలేదు. దీంతో అంతటా అయోమయం నెలకొంది. జూన్ 30వ తేదీ తర్వాత మృతిచెందిన వారి పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు కావడం లేదు. ప్రభుత్వం విధి విధానాలు విడుదల చేయకపోవడంతో సైట్‌ను ఆపేశారు. దీంతో జులైలో మృతి చెందిన వారి పేర్లు ఇప్పటి వరకూ ఆన్‌లైన్ కాలేదు. ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన కుటుంబాలు గ్రామ, పట్టణ సచివాలయాలకు వెళ్లి నిరాశతో వెనుదిరిగి వస్తున్నారు. ఇంకా ప్రభుత్వం ఏ నిర్ణయమూ తీసుకోలేదని.. ప్రభుత్వం విధి విధానాలు ప్రకటించాక చెబుతామంటూ సచివాలయ ఉద్యోగులు చెబుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో బీమా సాయం అందుతుందా లేదా అన్న ఆందోళన బాధిత కుటుంబాల్లో నెలకొంది. గత లెక్కలు ప్రకారం పరిశీలిస్తే ప్రతినెలా ఒక్కో జిల్లాలో 20 నుంచి 30 వరకూ బీమా క్లయిమ్స్ నమోదైన పరిస్థితి కనిపిస్తోంది. జులై నెలలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చాలా కుటుంబాలు ఇంటి పెద్దదిక్కును కోల్పోయిన పరిస్థితి నెలకొంది. ఇలాంటి వారంతా సచివాయాలకు వెళ్లి నిరాశగా వెనక్కి వస్తున్నారు. ఎన్నికల సందర్భంగా టిడిపి కూటమి విడుదల చేసిన మ్యానిఫెస్టోలో చంద్రన్న బీమా కింద సహజ మరణానికి రూ.ఐదు లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.పది లక్షలు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చి 50 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకూ చంద్రన్న బీమా విధి విధానాలు ఖరారు కాలేదు. దీంతో బీమా సాయం వస్తుందా లేదా అన్న అనుమానాలు బాధితుల్లో నెలకొన్నాయి. బాధిత కుటుంబ సభ్యులు టిడిపి, జనసేన నాయకులను కలిసి తమను ఆదుకోవాలంటూ వేడుకుంటున్నారు. నాయకులకు ఏంచేయాలో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం వెంటనే చంద్రన్న బీమా విధి విధానాలను విడుదల చేసి బాధిత కుటుంబాలకు బీమా సాయం అందించాలని అంతా కోరుతున్నారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి..
న్యాయ సేవాధికార సంస్థ కృషి

న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్



ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పేదలకు ఉచిత న్యాయ సహాయం అందించడంతో పాటు పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరం పరిష్కరించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృషి చేస్తోందని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ తెలిపారు. జిల్లాలో ఈ సంవత్సరం ఎన్ని కేసులు పరిష్కరించారు? ఉచిత న్యాయ సహాయంపై అవగాహన కల్పించేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపడుతున్నారు? దిశా వన్ స్టాప్ సెంటర్ సత్ఫలితాలు ఇస్తుందా? న్యాయ సేవాధికార సంస్థ చేపట్టే కార్యక్రమాలు గ్రామస్థాయి వరకూ వెళ్తున్నాయా వంటి పలు ప్రశ్నలకు ప్రజాశక్తి జరిపిన ముఖాముఖిలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

ప్రశ్న : న్యాయ సేవాధికార సంస్థ ఎప్పుడు ఏర్పాటు చేయబడింది? దాని లక్ష్యం ఏంటి?

నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ 1987లో పార్లమెంట్ చేత ఆమోదించబడి, 1995 నవంబర్ 9వ తేదీన అమల్లోకి వచ్చింది. తర్వాత రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా స్థాయిలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు ఏర్పాటు చేయబడ్డాయి. అలాగే జిల్లా, మండల స్థాయిలో మండల న్యాయ సేవాధికార సంస్థలు 10 వరకూ ఏర్పాటు చేయడం జరిగింది. సమాజంలోని పేద, బడుగు, బలహీన వర్గాలకు ఉచిత న్యాయ సేవలను అందించడంతోపాటు వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోవడం కోసం ఈ న్యాయ సేవాధికార సంస్థ పనిచేస్తోంది.

ప్రశ్న : ఈ ఉచిత న్యాయ సహాయం పొందడానికి ఎవరు అర్హులు? ఏయే కేసుల్లో ఈ ఉచిత న్యాయ సహాయం అందిస్తారు?

మూడు లక్షల్లోపు వార్షిక ఆదాయం ఉన్న పేద, బడుగు, బలహీన వర్గాలకు ఈ ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుంది. ముఖ్యంగా కక్షిదారులు తమ కేసుల్లో న్యాయవాదులను ఏర్పాటు చేసుకోలేరో వారికి న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తుంది. ఆ న్యాయవాదులకు అవసరమైన సొమ్మును నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (నల్సా) నుంచి చెల్లిస్తారు.

ప్రశ్న : లోక్ అదాలత్ ఉద్దేశం ఏంటి? లోక్ అదాలత్ ఎలాంటి ఫలితాలను ఇస్తుంది?

న్యాయస్థానాల్లో పెరిగిపోతున్న కేసులకు త్వరితగతిన శాశ్వత పరిష్కారం చూపడానికి లోక్‌అదాలత్‌ను అందుబాటులోకి తెచ్చారు. ఇక్కడ ఇచ్చే తీర్పు అంతిమ తీర్పు. దీనిపై కక్షిదారుల్లో, సంబంధిత శాఖల అధికారుల్లో, ఇన్సూరెన్స్ కంపెనీల్లో మంచి స్పందన వస్తుంది.

ప్రశ్న : ఈ సంవత్సరం ఇప్పటివరకూ ఎన్ని జాతీయ లోక్ అదాలత్‌లు నిర్వహించారు? ఎన్ని కేసులు పరిష్కరించారు?

ఈ సంవత్సరం ఇప్పటివరకూ రెండు జాతీయ లోక్ అదాలత్‌లు అయ్యాయి. సెప్టెంబర్ 14వ తేదీన మూడో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం జనవరి ఒకటో తేదీ నుంచి జూన్ 30వ తేదీ వరకూ 343 ప్రీ లిటిగేషన్ కేసులు, 3,298 పోస్ట్ లిటిగేషన్, 2,651 క్రిమినల్, 359 పెండింగ్, 288 వాహన ప్రమాద కేసులు పరిష్కరించాం.

ప్రశ్న : దిశా వన్ స్టాప్ సెంటర్ ఉద్దేశం ఏంటి? ఎలాంటి ఫలితాలను ఇస్తుంది?

భార్యాభర్తల మధ్య చిన్న చిన్న తగాదాలు, అభిప్రాయ బేధాలు వచ్చినప్పుడు దిశా వన్‌స్టాప్ సెంటర్లో ఫిర్యాదు చేయొచ్చు. అక్కడికి వచ్చిన వారికి షెల్టర్ హోంలో వసతి, భోజనం ఏర్పాటు చేయడం జరుగుతుంది. భార్యాభర్తలు ఇద్దరికీ కౌన్సిలింగ్ నిర్వహిస్తాం. సమస్య పరిష్కారం కానీ పక్షంలో పోలీసులకు ఆ కేసును రిఫర్ చేస్తాం.

ప్రశ్న : న్యాయ సేవాధికార సంస్థ ఇంకా ఏయే సంస్థలను పర్యవేక్షిస్తుంది?

ప్రతి నెలా క్రమం తప్పకుండా వసతిగృహాలు, జువైనల్ హోమ్స్, వృద్ధాశ్రమాలు, జైళ్లు తనిఖీ చేసి అక్కడ అందుతున్న సౌకర్యాలు, ఆహారం, వసతి, పరిశుభ్రత తదితర అంశాలు పర్యవేక్షిస్తున్నాం. అలాగే వారిలో ఎవరికైనా ఉచిత న్యాయ సహాయం కావలిస్తే అందించడం జరుగుతుంది.

ప్రశ్న : జిల్లాలో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు ప్రస్తుతం ఎన్ని పని చేస్తున్నాయి? ఎలాంటి సేవలు అందిస్తున్నాయి?

ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 16 లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు పనిచేస్తున్నాయి. ఇందులో ఒక న్యాయవాది ఒక పారా లీగల్ వాలంటీర్ ఉంటారు. వీరు వారానికి రెండు సార్లు జైళ్లకు, వారానికి ఒకసారి గ్రామాలకు వెళ్లి అక్కడ అవసరమైన వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. న్యాయ సలహాలు, సహాయం అందిస్తారు.

ప్రశ్న : విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీం ద్వారా ఎవరికి లబ్ధి చేకూరుతుంది?

విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీంకు జిల్లా స్థాయిలో జిల్లా జడ్జి నేతృత్వంలో కమిటీ ఉంటుంది. ఆ కమిటీ విచారణ అనంతరం పోక్సో కేసులు, ఇతర క్రిమినల్ కేసుల్లో బాధితులకు నష్టపరిహారం అందించడం జరుగుతుంది.

ప్రశ్న : ఉచిత న్యాయ సహాయం, లోక్ అదాలత్, ఇతర న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందించే సేవలపై ప్రజలకు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు?

న్యాయ సేవాధికార సంస్థ అందించే సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి విస్తృత స్థాయిలో గ్రామాల్లో, కళాశాలల్లో, పాఠశాలల్లో అనేక అవగాహనా సదస్సులు, న్యాయ విజ్ఞాన కేంద్రాలు నిర్వహిస్తున్నాం. అలాగే విద్యార్థులకు రకరకాల పోటీలు నిర్వహిస్తున్నాం. ఈ సంవత్సరం జిల్లాలో ఇప్పటివరకు 251 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

ప్రశ్న : న్యాయ సేవధికార సంస్థ ద్వారా ఇంకా ఏ ఇతర కార్యక్రమాలు చేపడుతున్నారు?

ఇటీవల రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు హెల్మెట్‌పై అవగాహనా సదస్సులు, అవగాహనా ర్యాలీలు నిర్వహించాం. విద్యార్థులు, యువతకు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వినియోగంపై, వాటి ద్వారా వచ్చే నష్టాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. మొక్కలు నాటడం వంటి కార్యక్రమాలు చేపట్టాం.

ప్రశ్న : కక్షిదారులకు, ప్రజలకు మీరిచ్చే సలహా ఏంటి?

న్యాయ సేవాధికార సంస్థ ద్వారా అందిస్తున్న సేవలను కక్షిదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. లోక్ అదాలత్‌లో తమ కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులు సొమ్మును, సమయాన్ని ఆధార్ చేసుకోవచ్చు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి.

కాకులను కొట్టి గెద్దలకు పెట్టేలా కేంద్ర బడ్జెట్

రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతులు చించి దహనం చేసి నిరసన

ఏలూరు అర్బన్ : ప్రతులు చించివేసి నిరసన తెలుపుతున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రైతాంగ, కార్మిక, ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఏలూరులో రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ పత్రాలు చించి వేసి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఆదివారం ఏలూరులోని వసంత మహల్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. రైతాంగ, కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకించాలని, వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని, పోలవరం నిర్మాణానికి నిధులు కేటాయించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, బికెఎంయు జిల్లా అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ కిసాన్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పార్లమెంటులో కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కాకులను కొట్టి గెద్దలకు పెట్టేలా ఉందని విమర్శించారు. వ్యవసాయ రంగానికి భారీగా నిధుల కోత పెట్టడం దారుణమన్నారు. ఆహార రాయితీ, ఎరువుల రాయితీ, ఉపాధి హామీ నిధుల కోత పెట్టి బడా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ కంపెనీలకు రూ.లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇవ్వడమేనా వికసిత్ భారత్ అని ప్రశ్నించారు. దేశంలో 60 శాతం మంది ఆధారపడిన వ్యవసాయ రంగాన్ని కేంద్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తోందన్నారు. రైతాంగం కోరుకున్న విధంగా కేంద్ర బడ్జెట్ లేదన్నారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కేరళ తరహాలో రుణ విమోచన చట్టం తీసుకొచ్చి రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. పోలవరం నిర్మాణానికి నిధుల కేటాయింపు లేకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్లు గ్రాంట్‌గా కాకుండా అప్పుగా ఇవ్వడం విడ్డూరమన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇచ్చి, విభజన చట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక కేంద్ర బడ్జెట్‌ను అందరూ వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం, ఎఐటియుసి, బికెఎంయు, కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు పొట్టేలు పెంటయ్య, బుగ్గల ప్రభాకర్, రంభ కిషోర్, దాసరి రాంప్రసాద్, అరిగెల యోహన్, ఎ.అప్పలరాజు, కడుపు కన్నయ్య, ఎం.ఇస్సాక్, తలారి జయరాజు, కెవిఎస్ఎన్.మూర్తి, వైఎస్.కనకారావు, వేల్పుల వెంకటేశ్వరరావు, సేవాదళ్ సుబ్బారావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : ప్రతులు చించివేసి నిరసన తెలుపుతున్న నేతలు

కేంద్ర బడ్జెట్‌పై నిరసన

జీలుగుమిల్లి : రైతాంగ, కార్మిక, ప్రజా వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా సంయుక్త కిసాన్ మోర్చా ఇచ్చిన పిలుపులో భాగంగా ఆదివారం పి.అంకంపాలెం, పాములవారిగూడెం గ్రామాల్లో మండల రైతు సంఘం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్ ప్రతులను చించి వేసి, దహనం చేశారు. అనంతరం కొంతసేపు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు సంఘం కార్యదర్శి శిరిబత్తుల సీతారామయ్య మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. తెలంగాణలో మాదిరిగా రెండు లక్షల రుణమాఫీ ప్రకటించాలని, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయింపులు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండలాధ్యక్షులు దాసరి జానకి రామిరెడ్డి, ఉపాధ్యక్షులు బిక్కిన వీరసత్యం, వీర్రాజు, శ్రీను, రమేష్, దావీదు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైద్య సేవలు

వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

గోదావరి వరదల కారణంగా గ్రామాలు వీడి, సురక్షిత ప్రాంతాలైన గుట్టలపై మెట్టలపై తల దాచుకుంటూ వ్యాధులు బారిన పడుతున్న ఎందరికో వైద్య సిబ్బంది ఎంతో సాహసోపేతంగా వైద్య సేవలు అందించడం హర్షనీయంగా రుద్రంకోట గ్రామస్తులు తెలిపారు. గత పది రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు, చుట్టుముట్టిన వరద కారణంగా గుట్టపై గూడారాల్లో తల దాచుకుంటున్న తాము దోమల కారణంగా విషజ్వరాలు, రొంప, దగ్గు తదితర వ్యాధులతో ఇబ్బంది పడుతున్నామని, ఈ విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది పడవలపై తమ వద్దకు వచ్చి వైద్య సేవలు అందించడంతో ఎంతో ఊరట చెందామని చెప్పారు. ఈ వైద్య సేవలను అందించిన ఎంఎల్‌హెచ్‌పి సుశీల, ఎఎన్ఎం తబిత, ఆశా వర్కర్ రిబ్కాలకు కృతజ్ఞతలు తెలిపారు.

గోదావరి రేవుల వద్ద పోలీస్ బందోబస్తు

ప్రజాశక్తి - పోలవరం

గోదావరి వరద ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో మండలంలో పలుచోట్ల గోదావరి రేవుల్లో పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గూటాల ఇసుక ర్యాంపు, పట్టిసీమ ఫెర్రి రేవు, పోలవరంలో యడ్లగూడెం కడమ్మ ఎత్తిపోతల పథకం రేవు వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాలుగు ప్రాంతాల్లో రెండు షిఫ్టులుగా ఎనిమిది మంది సిబ్బంది గస్తీ నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నదీ తీరాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. పట్టిసీమ ఫెర్రీ రేవు వద్ద ప్రమాదకరంగా కోతకు గురైన ప్రాంతంలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

గొల్లగూడెంలో విద్యుత్ పునరుద్ధరణ

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

ఇటీవల పెద్ద వాగు సృష్టించిన విధ్వంసంలో గ్రామాలతో పాటు విద్యుత్ లైన్లు ధ్వంసమైన సంఘటన అందరికీ తెలిసిందే. దీంతో ఈ గ్రామాల ప్రజలు అంధకారంలో మగ్గుతున్నారు. విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఇఇ రాధాకృష్ణ ఆయా గ్రామాలకు జనరేటర్లు ఏర్పాటు చేసి సరఫరాను కొనసాగిస్తూ శని, ఆదివారాల్లో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా 45 స్తంభాలు నూతనంగా ఏర్పాటు చేసి ఆ గ్రామానికి విద్యుత్ సరఫరాను అందించారు. దీంతో ఎస్‌సి సాల్మన్ ఆరోగ్యరాజ్, ఇఇతో సహా వేలేరుపాడు మండలంలో పనిచేస్తున్న సిబ్బందిని అభినందించారు. ఇదే విధంగా గొల్లగూడెం గ్రామస్తులు ఇంత తొందరగా ఇన్ని స్తంభాలు వేసి విద్యుత్ సరఫరాను అందిస్తారని ఊహించలేకపోయామని కాని దాన్ని సాధ్యం చేసిన విద్యుత్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

ముంపు బాధితులకు నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పెదవాగు ప్రాజెక్ట్ ముంపునకు గురై నిరాశ్రయులైన వేలేరుపాడు మండలంలోని అల్లూరి నగర్, ఊట గుంపు, ఒంటిబండ గ్రామాల్లోని వరద ముంపు బాధితులకు జీలుగుమిల్లి అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు యూత్ ప్రెసిడెంట్ తలారి సతీష్ తెలిపారు. జీలుగుమిల్లి గ్రామస్తులు, యూత్ సభ్యుల సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వెంకటేష్, మనోజ్, జనార్ధన్, మాధవ్, శ్రీహరి, జగదీష్, గంగాధర్ పాల్గొన్నారు.

కృష్ణా డెల్టాకు సాగు నీరందించాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాస్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కృష్ణా డెల్టాకు సాగునీరు అందించాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి క.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్నే భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో అతివృష్టి, మరోవైపు అనావృష్టి పరిస్థితులు ఉండడం వల్ల అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కృష్ణా డెల్టా పరిధిలోని ఏలూరు, పెదపాడు, దెందులూరు మండలాల్లోని భూములకు సాగు నీరు అందక పంట పొలాలు బీటలు వారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణా డెల్టాకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని కోరారు. సాగునీరు అందించేందుకు అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులను సమీకరించి ఆందోళనలు చేపడతానని హెచ్చరించారు.

రైతుల సంక్షేమానికి కృషి

సాగునీరు విడుదల చేసిన ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్

ప్రజాశక్తి - దెందులూరు

ఇది రైతు ప్రభుత్వమని, రైతుల సంక్షేమానికి అన్ని విధాలా అండగా ఉంటామని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ అన్నారు. టిడిపి ప్రభుత్వంలో నిర్మించిన పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా నేడు వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తూ రైతన్నలకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. దెందులూరు నియోజకవర్గం పెదవేగి మండలంలోని అంకన్నగూడెం స్లూయిజ్, దెందులూరు మండలం కొప్పులవారిగూడెంలోని గుండేరు రెగ్యులేటర్ ద్వారా శనివారం రాత్రి దిగువ ప్రాంతాలకు గోదావరి జలాలను దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు బొప్పన సుధ, క్లస్టర్ ఇన్‌ఛార్జి అయినాల వెంకటనారాయణ, సీనియర్ నాయకులు తాతా సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు చిట్టియ్య, ఉపాధ్యక్షులు చంద్రయ్య, దెందులూరు ఎఇ కిషోర్, కృష్ణా కెనాల్ ఎఇ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డిస్ట్రిబ్యూటర్ల సమస్యల పరిష్కారానికి కృషి

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డిస్ట్రిబ్యూటర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఫెడరేషన్ ఆఫ్ కన్స్యూమర్స్ డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి జనరల్ బాడీ సమావేశం ఏలూరులోని మర్చంట్స్ ఛాంబర్ నేరెళ్ల రాజా కళ్యాణ మండపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పలువురు డిస్ట్రిబ్యూటర్లు హాజరయ్యారు. ముఖ్యఅతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణ హాజరై మాట్లాడారు. వ్యాపారులకు ఎటువంటి సమస్యలు తలెత్తినా కూటమి ఎంఎల్ఎ అండగా నిలబడతారని భరోసా ఇచ్చారు. అనంతరం ఎంఎల్ఎను అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి ప్రెసిడెంట్ ఎంటివి సత్యకుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా డిస్ట్రిబ్యూటర్లు ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ, లాభాలు లేకుండా ప్రజా సౌకర్యార్థం పంపిణీ చేస్తున్నమని తెలిపారు. వర్తక వాణిజ్య వ్యాపార రంగాల్లో ఎన్నో ఒడిదుడుకులు ఉన్నప్పటికీ తామంతా కలిసికట్టుగా ఉన్నామని తెలిపారు. జనరల్ సెక్రటరీ గురుప్రసాద్ మాట్లాడుతూ ఈ రాష్ట్ర వ్యాప్త సదస్సుకు సుమారు 800 పైగా సభ్యులు పాల్గొనడం పట్ల అసోసియేషన్ నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో డిస్ట్రిబ్యూటర్లు నేరెళ్ల రాజా, శేషయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.5 లక్షల విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

దాతకు బాండ్ పేపర్ అందిస్తున్న ఆలయ ఇఒ

ద్వారకాతిరుమల వెంకటేశ్వర స్వామి ఆలయంలో శాశ్వత నిత్యాన్నదాన పథకానికి గుంటూరు జిల్లాకు చెందిన ఆలపాటి వెంకటరత్నం రూ.ఐదు లక్షలు (విశాఖపట్నం కోపరేటివ్ బ్యాంక్, గుంటూర్ బ్రాంచ్ డీడీ) విరాళాన్ని అందించారు. ఈ విరాళాన్ని ఆలయ ఇఒ వేండ్ర త్రినాథరావుకు అందించారు. ప్రతిరోజు ఆలపాటి వెంకటరత్నం, శివ నాగేంద్ర పేరున అన్న ప్రసాద వితరణ చేయాలని దాత కోరారు. దాత వెంకట ర్నతంకు స్వామివారి ప్రత్యేక దర్శనం, తీర్థ ప్రసాదాలు, బాండ్ పేపర్ అందించారు.

సింగరాయపాలెంలో గ్రోత్ ప్రమోట్ తయారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌ఛార్జి గౌతమ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తాతారావు ఆదేశాల మేరకు ఆదివారం స్పెషల్ ప్రోగ్రాం చేప బెల్లం ద్రావణం తయారు చేశారు. ఈ సందర్భంగా గౌతమ్ కుమార్ చేప బెల్లం ద్రావణం తయారీ విధానం, ఉపయోగాలు రైతులకు, మహిళలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి సుధాకర్, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

బిల్లిమిల్లిలో వ్యక్తి హత్య?

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని బిల్లిమిల్లి ఏజెన్సీ గ్రామంలో గిరిజనుడు హత్యకు గురయ్యాడు. ప్రశాంతంగా ఉన్న ఏజెన్సీలో హత్య ఉదంతంపై ఏజెన్సీ వాసులు ఉలిక్కపడ్డారు. డిప్పకాయలపాడు పంచాయతీ బిలిమిల్లికి చెందిన గిరిజనుడు చోడెం వెంకటేష్ తన ఇంట్లో మృతి చెంది ఉన్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌తో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలవరం సిఐ మధుబాబు, కొయ్యలగూడెం ఎస్ఐ తెలిపారు.

గుండెపోటుతో చెత్త వ్యాన్ డ్రైవర్ మృతి

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి గ్రామపంచాయతీలో చెత్త తరలించే వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్న పరసా శ్రీరాములు(70) గుండెపోటుతో ఆదివారం తెల్లవారుజామున మండలంలోని దాకారంలో మృతి చెందారు. శ్రీరాములు మృతి వార్త తెలుసుకున్న ముదినేపల్లి గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ, వైస్ సర్పంచి ఈడే సుధాకరరావు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. దహన సంస్కరణ నిమిత్తం రూ.15 వేలు శ్రీరాములు కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ బిక్షాలు, స్వామియేలు, మల్లికార్జునరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమస్యల సుడిలో కొత్తూరు వాసులు

పంచాయతీలో కలపకపోవడంతో అభివృద్ధి శూన్యం

భవనాలు నిర్మించినా ప్రారంభం కాని వైనం

స్వచ్ఛ తాగునీరు లేక అవస్థలు

పనుల్లేక ఇబ్బందులు

నాణ్యత లేకుండా అసంపూర్తిగా నిర్మాణం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులు ఎన్నో ఏళ్లుగా గోదావరి చుట్టూ వారి నివాసాలు ఏర్పరచుకుని జీవనం సాగిస్తున్నారు. 1941లో మొదలైన ఈ ప్రాజెక్టు 2024 అయినా ఒక కొలిక్కి రాలేదు. నిర్వాసితులు సమస్యలతో సతమతమవుతున్నారు. ప్రాజెక్టు పేరుతో వారిని ఉన్న పల్లన వారి గ్రామాల నుంచి ఇతర ప్రాంతాలకు తరలించారు. కొత్త ప్రాంతాలకు తరలి రావడంతో ఉపాధి అవకాశాలు కానరాని దుస్థితి. ఇలాంటి నిర్వాసితుల బాధితుల జాబితాలో కొత్తూరు గ్రామం ఒకటి. పోలవరం మండలం కొత్తూరు గ్రామం నుంచి కొయ్యలగూడెం మండలం బయన్నగూడెం గ్రామ శివారు నుంచి సరిపల్లి వెళ్లే మార్గంలో ప్రభుత్వం నివాసయోగ్యమైన ప్రాంతాన్ని గుర్తించి అక్కడ నిర్మాణాలు చేపట్టింది. దాదాపు అన్ని నిర్మాణాలు పూర్తయ్యాయి.

నిర్మాణం పూర్తయినా తెరుచుకోని భవనాలు

కొత్తూరు గ్రామంలో అంగన్వాడీ భవనం పూర్తయినా అక్కడ బోధన తరగతులు ప్రారంభం అవ్వలేదు. అదే గ్రామంలో నివాస గృహాల్లో పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో హుటాహుటినా పోలింగ్ స్టేషన్ ఏర్పాటు నిమిత్తం అంగన్వాడీ భవనం సిద్ధం చేశారు. తర్వాత మళ్లీ పోలింగ్ కేంద్రాన్ని వొంకబొత్తప్పగూడేనికి మార్చారు.

సబ్‌సెంటర్ కూడా పూర్తి కావొచ్చింది. ఇక్కడ కూడా కార్యకలాపాలు జరగడం లేదు. అవసరం అయినప్పుడు వేరే ప్రాంతం నుంచి ఎఎన్ఎం వర్కర్ వచ్చి చూసి వెళ్తుంటారు. నిత్యం అందుబాటులో ఉండరు. ప్రైమరీ స్కూల్ నిర్మాణం జరిగినా ఇక్కడ టీచింగ్ ఫ్యాకల్టీని నియమించలేదు. ఇక్కడ భవనం పూర్తయినా ప్రారంభం కాకపోవడంతో దగ్గరలో ఉన్న ప్రయివేట్ స్కూల్లో చేర్పిస్తున్నామని, ఆర్థికంగా భారమవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు.

పంచాయతీ లేదు

ఈ ప్రాంతానికి వచ్చి మూడేళ్లవుతున్నా పంచాయతీ లేదు. ఏ పంచాయతీ పరిధిలో కలపలేదు. సరిపల్లి పంచాయతీలో కలుపుతామని అధికారులు చెబుతున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. సరిపల్లి పంచాయతీలో కలిపితే గ్రామ అవసరాలకు కావాల్సిన నిధులు తెచ్చుకుని గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అవకాశం ఉంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

నీళ్లతో అనారోగ్యం

గ్రామంలో నీళ్ల ట్యాంకు నిర్మించినా అవి తాగడానికి పనిచేయడం లేదు. తప్పని పరిస్థితుల్లో తాగిన కాళ్ల నొప్పులు, తలపోటు, ఇతర రోగాల బారిన పడుతున్నామని, నీళ్ల కోసం కొయ్యలగూడెం, బయ్యనగూడెం గ్రామాలకు వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్యసాయి గోదావరి నీళ్లు మా గ్రామానికి వచ్చేలా ఏర్పాట్లు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో ముగ్గురికి ఆర్అండ్ఆర్ నిధులు అందలేదు. కొంత మందికి సగం మాత్రమే అందాయి.

శ్మశాన వాటిక కూడా కరువే

గ్రామంలో శ్మశానవాటిక లేకపోవడం వల్ల చాలా ఇబ్బందులకు గురవుతున్నామని, వేరే ప్రాంతాలకు తీసుకెళ్లి ఖననం చేయాల్సి వస్తుందని గ్రామస్తులు వాపోతున్నారు. వేర్వేరు సంప్రదాయాల వారు వారి సంప్రదాయాల ప్రకారం చేసుకునే అవకాశం కూడా లేకుండా అందరినీ ఒకే పద్ధతిలో ఖననం చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కరువైన ఉపాధి

మండలంలోని కొత్తూరు గ్రామంలో నివసించేటప్పుడు అక్కడ వ్యవసాయ కూలీలుగా, ఇతరేతర భవన కార్మికులుగా పనులు దొరికేవి. ఇక్కడికి వచ్చాక పనులు దొరకని పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం పనిలోకి వెళ్లినా వంద రోజుల పని కాలం కాస్త ఇంట్లో ఇద్దరు వెళ్తుంటే అది 50 రోజులకే సమాప్తం అవుతుంది. నిర్వాసితులకు 150 రోజులు పని దినాలు ఉన్నా అవి అధికారులు అమలు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి తమ సమస్యలను పరిష్కరించాలని కొత్తూరు వాసులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నీరు విడుదల చేస్తున్న మంత్రి పార్థసారధి

రైతులకు అండగా ఉంటా

సాగునీరు విడుదల చేసిన మంత్రి పార్థసారధి

ప్రజాశక్తి - చాట్రాయి

మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టును రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఆదివారం పరిశీలించారు. పోతనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న కుడి కాలువ గేట్లు ఎత్తి సాగునీరు విడుదల చేశారు. పంటలకు సాగునీరు విడుదల చేసిన మంత్రికి ఆయకట్టు రైతులు హర్షధ్వానాలతో ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మంత్రి పార్థసారధి మాట్లాడుతూ రైతు క్షేమమే టిడిపి ధ్యేయమన్నారు. రైతులను అన్ని విధాలుగా ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షురాలు బొట్టు వరలక్ష్మి, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మందపాటి బసవరెడ్డి, ఏలూరు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు మంత్రి పరామర్శ

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆర్యవైశ్య ప్రముఖులు, వ్యాపారవేత్త మడుపల్లి నారాయణరావు(83), విన్నపాల లక్ష్మీకాంతమ్మ (చక్రమ్మ) (80) మృతదేహాలను రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారధి సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నూజివీడు నియోజకవర్గ సమన్వయ కర్త బర్మా ఫణిబాబు, ఆగిరిపల్లి సర్పంచి లక్ష్మీ విక్టర్‌బాబు, పలు పార్టీల నాయకులు,పాల్గొన్నారు.

'ఎపి టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ పదవి నాగేశ్వరరావుకు ఇవ్వాలి'

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆంధ్రప్రదేశ్ టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ పదవి ఎపి టైలర్స్ వర్కర్స్ హెల్పర్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కత్తి నాగేశ్వరరావుకు ఇవ్వాలని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాడిగడప ఆంజనేయరాజు ప్రభుత్వాన్ని కోరారు. కత్తి నాగేశ్వరరావు 1983 నుంచి టిడిపిలో ఉంటూ పార్టీకి ఎనలేని సేవలందించారన్నారు. రాష్ట్రంలో ఏ టైలర్‌కి కష్టమొ చ్చినా వెంటనే స్పందించి ఆ టైలర్‌ని ఆదుకునే నాగేశ్వరరావు ఛైర్మన్ పదవికి అర్హులన్నారు. నాగేశ్వరరావుకు సిఎం చంద్రబాబు ఛైర్మన్ పదవి ఇస్తారని ఆశిస్తున్నామని చెప్పారు.

కామవరపుకోట : ఆంధ్రప్రదేశ్ టైలర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా కత్రి నాగేశ్వరరావును ఎంపిక చేయాలని ఎపి టైలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాడిగడప ఆంజనేయరాజు కోరారు. ఆదివారం ఆయన కామవరపుకోటలో మాట్లాడుతూ నాగేశ్వరరావు రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా ఎంపికైతే కష్టాల్లో ఉన్న టైలర్స్‌ను ఆదుకుంటారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఐకమత్యంగా పనిచేస్తేనే సమస్యలు పరిష్కారం

రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఛైర్మన్ సాయికృష్ణప్రసాద్

ప్రజాశక్తి- ఏలూరు సిటీ

ఐకమత్యంగా పనిచేసినప్పుడే సమస్యలు పరిష్కారమవుతాయని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ జిల్లా ఛైర్మన్ సాయికృష్ణప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గహ నిర్మాణ సంస్థ ఏలూరు జిల్లా అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వసభ్య సమావేశం జిల్లా పరిషత్ ప్రాంగణంలోని పంచాయతీరాజ్ జిల్లా మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి పార్థసారధికి వినతిపత్రం అందించినట్లు చెప్పారు. సిఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌లు పలు సమస్యల పట్ల అవగాహనతో తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. యూనియన్ పశ్చిమగో దావరి ప్రెసిడెంట్ రంప వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఏ సమస్య వచ్చినా ఐకమత్యంగా ఉన్నప్పుడే పరిష్కార మవుతుందన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గృహ నిర్మాణ శాఖ డిఇ వివిఎస్ఎస్.రాణి ఈ నెలాఖరులో రిటైర్‌మెంట్ జరుగుతున్న సందర్భంగా సంఘ సభ్యులంతా ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో ఇఇ రామకృష్ణ, డిఇ ఎండి ఆరిఫ్, ఏలూరు యూనియన్ లీడర్ షేక్ ఫజియాల్ పాల్గొన్నారు.

మద్యం, మత్తు పదార్థాలను నిషేధించాలి

మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గాభవాని

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో మద్యపానం, మత్తు పదార్థాలను నిషేధించాలని మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మత్స దుర్గాభవాని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఏలూరు జిల్లా ప్రధాన కార్యాలయం స్ఫూర్తి భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో రోజురోజుకు చిన్నారులు, బాలికలు, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. తాము అధికారం చేపట్టిన వంద రోజుల్లో రాష్ట్రంలో శాంతిభద్రతలు నియంత్రిస్తామని ప్రస్తుత హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారని, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్యగా స్వాగతిస్తున్నామని, ఆ దిశగా రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను నియంత్రించడానికి పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అఘాయిత్యాలకు కారణభూతమైన మద్యాన్ని నియంత్రించడంలో పాలకులు ఎవరైనా ఘోరంగా విఫలం చెందుతున్నారని విమర్శించారు. మద్యాన్ని ఆదాయ వనరుగా చూసి ఖజానాను నింపుకోవడానికి ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయే తప్ప మద్యాన్ని నియంత్రించడానికి చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలకు కారణమైన మద్యాన్ని నియంత్రించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా టిడిపి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వరకా శ్యామల, మన్నవ యామిని పాల్గొన్నారు.

పామాయిల్ రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి



మాట్లాడుతున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్

పామాయిల్ రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఆ మేరకు చర్యలు తీసుకోవాలని గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి సూచించారు. మండలంలోని ప్రగడవరంలో శ్రీరామపురం వద్ద గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ వారు ఆదివారం నిర్వహించిన పామాయిల్ మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు తమ సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. ట్రాక్టర్ ద్వారా తీసుకెళ్తున్న పామాయిల్ లోడును సాయంత్రం ఏడు దాటిన తర్వాత తీసుకోవడం లేదని, దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు చెప్పారు. గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీలో 24 గంటలు పామాయిల్ తీసుకునే విధంగా చేయాలని కోరారు. రోడ్లు గుంతలమయంగా ఉన్నాయని, మరమ్మతులు చేయాలని కోరారు. పామాయిల్ ఫ్యాక్టరీలోకి రైతులకు అనుమతి ఇవ్వడంలేదని చెప్పారు. రైతులకు కనీసం మద్దతు ధర ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ రైతులు సమస్యలు క్షుణ్ణంగా తెలుసుకున్నానని, పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. ఇదే విషయంపై అసెంబ్లీలో మాట్లాడానని, ఫ్యాక్టరీ లేబర్ విషయంపై పూర్తిగా నివేదిక ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే రైతులకు ఉపయోగపడే విధంగా కార్యాచరణ ఉంటుందన్నారు. రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని, త్వరలోనే రైతులతో ఒక సమావేశం ఏర్పాటు చేస్తానని తెలిపారు. అనంతరం తామర ఫ్యాక్టరీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు మాటూరి వెంకటరామయ్య, ఎంపిపి రాంబాబు, వైసిపి సర్పంచి భూపతి, జనసేన, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

అందని వేతనాలు.. తప్పని ఇబ్బందులు

దారుణంగా ఉపాధి హామీ కూలీల దుస్థితి

అధికారులు సమాధానం కూడా చెప్పడం లేదని ఆవేదన

ఉన్నతాధికారులు స్పందించాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముసునూరు

ఉపాధి హామీ చట్టం ద్వారా పని కల్పించి వచ్చిన నగదుతో కుటుంబ పోషణ చూసుకోవచ్చనే ఉద్దేశంతో ప్రవేశ పెట్టిన చట్టానికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. గత మూడు నెలల క్రితం పనిచేసిన ఐదు నుంచి ఎనిమిది వారాల వరకు వేతనాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఉపాధి హామీ కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల కార్యాలయం వద్దకు వెళ్లి వేతనాల గురించి అడిగితే సరిగా సమాధానం చెప్పడంలేదని, కార్యాలయానికి ఎందుకు వస్తారు, మాకు తెలియదు, మీ ఖాతాలో పడతాయాంటూ కోపగించుకుంటూ చిరాకుతో సమాధానం చెబుతున్నారని కూలీలు వాపోతున్నారు. వేతనాల అందక తీవ్ర ఇబ్బందులు తాము వాటి గురించి అడిగితే మండల ఉపాధి కార్యాలయ అధికారిణి కనీసం సమాధానం కూడా చెప్పడంలేదని, తమపై ఆగ్రహించుకుంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఎపిఒ వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

మండల ఎపిఒ కోపగించుకుంటున్నారు

రెడ్డి సాయిబాబు, ఉపాధి హామీ మేట్

ఉపాధి హామీ కూలీలకు రెండు, మూడు నెలల క్రితం పనిచేసిన వేతనాలు రావాలి. సుమారు ఐదు నుంచి ఎనిమిది వారాల పని దినాల వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కూలీలు మా వేతనాలు ఇంకా రాలేదని, మేం ఏం తిని బతకాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల ఎపిఒ కార్యాలయానికి వెళ్లి అడగగా ఎందుకు ఆఫీస్‌కి వస్తారంటూ కోపగించుకుంటున్నారు.

నాకు 5 నుంచి 7 వారాల వేతనాలు రావాలి

తాడిశెట్టి ఆంజనేయులు, ఉపాధి కూలీ

నేను గత ఎప్రిల్ నుంచి మొన్నటివరకు పనికి వెళ్లాను. నాకు ఇంకా ఐదు నుంచి ఏడు వారాల వేతనాలు రావాలి. నాకు పని చేస్తేనే జీవనం. అధికారులు స్పందించి వెంటనే మా వేతనాలు విడుదల చేయాలి.

అనారోగ్యంతో బాధపడుతున్నాను

రాజబోయిన రాంబాబు, ఉపాధి కూలీ

నేను కూలి పని చేసుకుని బతికేవాడిని. నాకు నాలుగు నుంచి ఏడు వారాల వేతనాలు రావాలి. కాని నేటివరకూ రాలేదు. ప్రస్తుతం నేను అనారోగ్యంతో బాధపడుతున్నాను. వేతనాలు వస్తే నాకు ఇబ్బందిగా ఉండదు.

మేము ఎలా బతకాలి

పోట్రు చిట్టిమ్మ, ఉపాధి హామీ కూలీ

నాకు ఉపాధి హామీ ఆరు వారాల వరకు రావాలి. అవి వస్తే నాకు ఆసరాగా ఉంటుంది. పనులు కూడా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. వేతనాలు రాకపోతే మేము ఎలా బతకాలి.

ఎపిఒ సమాధానం కూడా చెప్పడంలేదు

కుప్పాల రాములమ్మ, ఉపాధి కూలీ

వేసవి కాలంలో ఎండ కూడా లెక్క చేయకుండా ఎనిమిది వారాలు పని చేస్తే రెండు వారాలు మాత్రమే డబ్బులు వచ్చాయి. అనారోగ్యంగా ఉన్నా మందులకు అయినా ఉపయోగపడతాయని ఉపాధి పనికి వెళ్తే నేటివరకూ డబ్బులు పడలేదు. ఎపిఒ కార్యాలయానికి వెళ్తే కనీసం సమాధానం కూడా చెప్పడంలేదు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న విమలావతి బాయి

18 నుంచి తీజ్ మహోత్సవం

ప్రజాశక్తి - ఏలూరు

తీజ్ మహోత్సవాన్ని రాష్ట్రవ్యాప్తంగా వచ్చే నెల 18 నుంచి 26వ తేదీ వరకు తొమ్మిది రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారు. బంజారా బజరంగీ భేరి సంఘ ఆధ్వర్యంలో ఏలూరులోని దత్తాశ్రమం వద్ద ఉన్న సంఘ కార్యాలయంలో తీజ్ మహోత్సవం ప్రచార పోస్టర్‌ను, కరపత్రాన్ని రాష్ట్ర కమిటీ కో కన్వీనర్ బోడా విమలావతి బాయి చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బోడా విమలావతి బాయి మాట్లాడుతూ బంజారా సంస్కృతి ప్రకృతి సిద్ధమైన పండుగలతో, శాస్త్రీయమైన ఆలోచనలతో మిళితమై ఉంటుందన్నారు. బంజారా బజరంగీ భేరి జిల్లా నాయకులు భూక్యా నాగరాజు, తీజ్ ఉత్సవ కమిటీ రాష్ట్ర నాయకులు ధరావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడారు. జరభల కృష్ణ, ధరావత్ సూరజ్, భూక్యా జ్యోతి, శ్రీ అక్షర, గాయత్రి, స్నేహ, భువనశ్రీ, హిమజ, ఆర్యాహి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - కామవరపుకోట

ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలుగా పనిచేసే వారికి పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ఆయాల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చాట్ల పుల్లారావు, కంకిపాటి బుచ్చిబాబు డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే ఆయాల ఏలూరు జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం కామవరపుకోటలోని ఆర్అండ్‌బి బంగ్లా సమీపంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయాలకు ప్రభుత్వ గుర్తింపు కార్డు ఇవ్వాలన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు.

బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పోలవరం

బ్లడ్ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న పోలవరం మండలంలోని కొత్త పట్టిసీమ గ్రామానికి చెందిన మందపాటి నిఖిల్(12) కుటుంబానికి శ్రీ సాయిసేవా సదన్ సంస్థ ద్వారా రూ.ఐదు వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి సేవ సదన్ సంస్థ గ్రూపు సభ్యులు పెద్దేహపు రాజేష్, కొంజర్ల దుర్గాప్రసాద్, ఉలవల భయ్యా, రాజశేఖర్, కొంజర్ల సాయిరాం, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఈ నెల 29వ తేదీన ఏలూరు ఒకటో పట్టణంలో ఉన్న వెంకన్న ట్యాంక్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లలో చెట్ల కొమ్మలు తొలగింపు, సబ్‌స్టేషన్ వార్షిక మరమత్తుల నిమిత్తం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జెపిబి.నటరాజన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమయంలో వెంకన్న ట్యాంక్ సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తగూడెం సెంటర్, ఏడు కాలువల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా ఆలయం సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ ఆలయం ఏరియా, ఫిల్ హౌస్ పేట, వివర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం ఏరియా, కందకం రోడ్డు, సథరన్ స్ట్రీట్, దక్షిణపు వీధి, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

రోడ్డుకు మరమ్మతులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని పాత రావిచర్ల గ్రామంలో ఉన్న శ్రీ సత్యసాయి నిలయంతో పాటుగా కొత్తగా ఏర్పాటు చేసిన కాలనీకి వెళ్లే మార్గం మొత్తం గుంతలమయంగా అధ్వానంగా ఉంది. దీంతో కాలనీ వాసులు, రైతులు ఇబ్బం దులకు గురవుతున్నారు. గమనించిన టిడిపి నూజివీడు నియోజకవర్గ నాయకులు, ఎఎంసి మాజీ ఛైర్మన్ కాపా శ్రీనివాసరావు ఆ రోడ్డులో గ్రావెల్ పోయించి మరమ్మతు పనులు చేయించారు.

చారు ముజుందార్ వర్ధంతి

ప్రజాశక్తి - చాట్రాయి

నక్సల్బరి నిర్మాత చారు ముజుందార్ 52వ వర్ధంతి, సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ 50వ వ్యవస్థాపక దినోత్సవం మండలం మర్రిబందంలో సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి డి.పుల్లారావు నాయకత్వంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ పాలనలో పేట్రేగిపోతున్న మతోన్మాద ఫాసిజానికి వ్యతిరేకంగా, అలాగే రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కూటమి ప్రభుత్వంపై పోరాడాలని పిలుపు నిచ్చారు.

పాడి పశువులకు టీకాలు వేయించాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పశువులకు వ్యాధులు సోకకుండా పశు యజమానులు టీకాలు వేయించాలని మండల పశు వైద్యాధికారి కె.కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఆరు వేల గేదెలకు జబ్బ వాపు రాకుండా, ఐదు వేల ఆవులకు బొబ్బచర్మ వ్యాధి సోకకుండా టీకాలు వేయనున్నట్లు ఆయన తెలిపారు.

'గన్నవరం విమానాశ్రయానికి రంగా పేరు పెట్టాలి'

ప్రజాశక్తి - ముదినేపల్లి

బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కీర్తిశేషులు వంగవీటి మోహన రంగా పేరు గన్నవరం విమానాశ్రయానికి పెట్టాలని ఎన్‌డిఎ యువ నాయకులు కోరారు. ఆదివారం ఆయన ముదినేపల్లిలో మాట్లాడుతూ కేంద్రంలో గత ప్రభుత్వ హయంలో అప్పటి రాజ్యసభ సభ్యుడిగా ఉన్న జివిఎల్.నరసింహారావు కూడా గన్నవరం ఎయిర్‌పోర్టుకు వంగవీటి మోహనరంగా అంతర్జాతీయ విమానాశ్రయంగా నామకరణం చేయాలని రాజ్యసభలో కోరారన్నారు.